

- జిల్లాలో 44.0మి.మీల సగటు వర్షపాతం నమోదు
- కురుస్తున్న భారీ వర్షాలకు జన జీవనం అతలాకుతలం
- సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల వరద గేట్ల ఎత్తివేత
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు
- పలు గ్రామాలకు నిలిచి పోయిన రాక పోకలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు



జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీ వద్ద లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



జలమయమైన నేరడిగొండ మండల కేంద్రం

జోరు వాన

జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు భారీవర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా తడిసి ముద్దయింది. పెన్‌గంగా, కడెం నదులతోపాటు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో సగటున 44.0 మి.మీల వర్షపాతం కురిసింది. అత్యధికంగా తలమడుగు మండలంలో 78.8 మి.మీ, మావలలో 76.3, భీంపూర్‌లో 70.8, బజార్‌హత్నూర్ 66.0, సాత్నాల 57.3, గుడిహత్నూర్‌లో 56.3, తాంసిలో 55.8, ఆదిలాబాద్‌అర్బన్‌లో 48.5, ఉట్నూర్ 38.0, సోనాలలో 37.3, బేల 36.3, నార్నూర్‌లో 35.8 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ఇంద్రవెల్లిలో 5.8 మి.మీల వర్షపాతం నమోదైంది.

ఆదిలాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 8 మండలాల్లో భారీ వర్షం, 12 మండలాల్లో ఓ మోస్తారు స్థాయిలో వర్షం కురిసింది. పలు మండలాల్లో వరదల బీభత్సానికి పంట చేన్లను వరద నీరు ముంచెత్తడంతో పత్తి, సోయా, కంది పంటలు నీటమునిగాయి. మళ్లీ వేల ఎకరాల్లో పంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బోథ్ మండలం పొచ్చెర సబ్‌స్టేషన్‌పై పిడుగుపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అదే మండలం ధన్నూర్ గ్రామంలో ఓ యువకుడు వాగులో కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడు. కుంటాల, పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాలు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. మరో 2 రోజుల పాటు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాకు ఆరేంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటల ఎదుగుదలపై ప్రభావం పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అంతా అతలాకుతలం..

గత రెండురోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జన జీవనం అతాలకుతలమయ్యింది. ఏకదాటిగా కురిసిన వర్షానికి ప్రజలు బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండిపోయారు. జిల్లాకేంద్రంలోని రోడ్లన్ని నిర్మానుషంగా మారి కనిపించాయి. వరద రోడ్లపై ప్రవహించడంతో చిన్నపాటి చెరువులను తలపించాయి. జిల్లాకేంద్రంలోని శివారు ప్రాంతంలోని కాలనీలను మురికి కాలువలు ముంచెత్తాయి. పలు ఇళ్లలోకి వరద వచ్చి చేరడంతో ఇంటి సామగ్రి తడిసిపోయింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ఖానాపూర్, తిర్పెల్లి, వాల్మీకినగర్, సుభాష్‌నగర్, రాంనగర్, రణదివ్యనగర్, తాటిగూడ, బొక్కలగూడ, జైజవాన్‌నగర్, క్రాంతినగర్, జీఎస్టేట్ కాలనీలోని పలు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. అలాగే నేరడిగొండ మండల కేంద్రంలో పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా అధికార యంత్రాంగం, రెస్క్యూ టీంలు ముందస్తు చర్యలు చేపట్టాయి.

వరదతో ఉధృతంగా పొచ్చెర జలపాతం



ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల వరద గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటిని (మిగతా 6వ పేజీలో..)

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)
తలమడుగు	78.8
మావల	76.3
బజార్‌హత్నూర్	66.0
సాత్నాల	56.5
గుడిహత్నూర్	56.3
తాంసి	55.8
ఆదిలాబాద్‌అర్బన్	48.5
భీంపూర్	38.5
సోనాల	37.3
ఉట్నూర్	36.8
నార్నూర్	35.8
జైనథ్	33.3
ఆదిలాబాద్‌రూరల్	33.3
బోథ్	28.8
గాదిగూడ	23.0
సిరికొండ	23.0
ఇచ్చోడ	14.8
బేల	7.0
ఇంద్రవెల్లి	5.8
జైనథ్	10.2



వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఆత్మ మార్కెట్ కమిటీ చైర్మన్

వరద బాధితులను ఆదుకోవాలని మంత్రిని కోరుతాం

బోథ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో జరిగిన నష్టాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించి బాధితులను ఆదుకోవాలని కోరుతామని ఆత్మా మార్కెట్ కమిటీ చైర్మన్‌లు రాజుయాదవ్, గంగారెడ్డిక పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వరద వల్ల నష్టపోయిన గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలతో జరిగిన నష్టం వివరాలను అధికారులు సేకరిస్తున్నారని, పూర్తిస్థాయి నివేదిక సీఎంకి అందజేస్తారని చెప్పారు. బాధితులు అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా కోరారు.

విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పోరాటం వల్లే విద్యుత్ ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు సాహసించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం విద్యుత్ అమరుల సంస్మరణ సభ నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకరాఘవులు, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఆర్.సురేందర్, ఆశన్న పాల్గొన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నది

సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తిన అధికారులు

జైనథ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలంలోని సాత్నాల, భోరజ్, జైనథ్ మండలాల పరిధిలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో వాగులు వంకలు చెరువులు, కాల్వలు వరదతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల సరిహద్దున గల పెన్‌గంగ నదిలో వరద ఉగ్రరూపంలో దాల్చుతోంది. సాత్నాల పరిధిలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన సాత్నాల ప్రాజెక్టు గల నాలుగు గేట్లలలో రెండు గేట్లను అధికారులు ఎత్తివేసి వరద నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు గరిష్ఠ సామర్థ్యం 286.50 ఎంఎం కాగా కష్ఠం సామర్థ్యం 286 మి.మీ.గా ఉంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.24 టీఎంసీలు ఉండగా 1.046 టీఎంసీలుగా నీరు ఉంది. ఇన్‌ఫ్లో 1980 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 4100 క్యూసెక్కులుగా ఉంది. ఉమ్మడి మండలంలో 16 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాత్నాల ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్‌రావ్, ఏఈ దీపక్ పర్యవేక్షిస్తున్నారు.

బ్రిడ్జి వద్ద వరదను పరిశీలించిన ఎమ్మెల్యే

జైనథ్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని తర్నం బ్రిడ్జిపై సాత్నాల నది వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల శంకర్ తర్నం బ్రిడ్జికి చేరుకొని వరద ఉధృతిని పరిశీలించారు. మహారాష్ట్ర, తెలంగాణకు రాకపోకలు ప్రజలు ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా అధికారులతో మాట్లాడారు. వయా నిరాలఅడ మీదుగా వాహనాలను మళ్లించాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎమ్మెల్యేను కలిసిన మథుర సమాజ్ జిల్లా కమిటీ సభ్యులు

నేరడిగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మథుర సమాజ్ జిల్లా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించి కమిటీ సభ్యులను శాలువలతో సత్కరించారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చడం ఆవశ్యకత గురించి సవివరంగా వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మథుర సమాజ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సాబ్లే అమర్‌సింగ్, ఉపాధ్యక్షుడు పడవల్ ఫత్తుసింగ్, ప్రధాన కార్యదర్శి అజడే కేవల్ సింగ్, కార్యదర్శి పడవల్ నానక్ సింగ్, తదితరులు ఉన్నారు.

యూరియా కోసం వచ్చిన రైతులు

బోథ్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు యూరియా కోసం గురువారం రైతులు వర్షంలో తడుస్తూనే క్యూ కట్టి యూరియా బస్తాలు తీసుకువెళ్లారు. సహకార సంఘం గోదాంకు మూడురోజుల క్రితమే యూరియా రాగా.. వినాయక చవితి సందర్భంగా పంపిణీ చేయలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సెలవుల పేరుతో యూరియా ఇవ్వకపోవడం సమంజసం కాదని రైతులు వాపోతున్నారు.



యూరియా కోసం తరలి వచ్చిన రైతులు

బోథ్‌లో ఓటరు జాబితా ప్రదర్శన

బోథ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీవో రమేష్ మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. 21 గ్రామపంచాయతీలకు సంబంధించిన 182 పోలింగ్ బూతులలోని ఓటర్ జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీలలో ఓటర్ జాబితాలను ప్రదర్శించామని ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ అతుల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ధన్నూర్ (బి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు.

గ్రామ పంచాయతీల వద్ద ఓటరు జాబితా ప్రదర్శన

ఇంద్రవెల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాలను వార్డుల వారీగా ప్రచురించి ఆయా పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డుపై గురువారం ప్రదర్శించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలపై దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్ రావు, పంచాయతీ సిబ్బంది జైస్వాల్ శంకర్ లాల్, ఇద్రిష్, గాయక్ వాడ్ నారాయణ, తదితరులున్నారు.



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఈవో సంజీవ్‌రావు

మత్తడిగూడ వాగుపై భారీ వంతెన నిర్మించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఉట్నూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్తడిగూడ వాగుపై ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో భారీ వంతెన నిర్మించి గిరిజనుల కష్టాలు తీర్చాలని రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మంగం విషంరావు డిమాండ్ చేశారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఎంపీడీఓ రాంప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వర్షాకాలం వస్తే మత్తడివాగు ప్రవాహంతో ఉట్నూర్‌కి రాకపోకలు నిలిచి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరాలు, ఇతర వ్యాధులు గాని వస్తే ఆసుపత్రికి వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు. ప్రసవ సమయంలో గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లాలంటే అంబులెన్స్ సైతం రాక ఇబ్బందిగా ఉందన్నారు. తమ గ్రామానికి సంబంధించినటువంటి మనుషులు కాని, జంతువులు కావచ్చు ఆవులు మేకలు బయటకి వెళ్లాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు తమ కష్టాలు చూసి సమస్య పరిష్కరించాలని విషంరావు కోరారు. ఆయనవెంట రాజ్‌గోండు సేవా సమితి ఆత్రం బొజ్జు పటేల్, నాయకులు ఉన్నారు.

బీమా పథకాలపై అందరికీ అవగాహన ఉండాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మెస్రం కోసేరావు, నాబార్డు ఎఫ్ఎల్ సీ లోక రాంరెడ్డిలు సూచించారు. నాబార్డు వారి సౌజన్యంతో సహకార బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని ఈశ్వర్ నగర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన అనే బీమా పథకాలతోపాటు అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ శారద, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

వర్షానికి దెబ్బతిన్న వంతెనను పరిశీలించిన తహసీల్దార్

బోథ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూరు గ్రామాన్ని గురువారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ సుభాష్‌చంద్ర సందర్శించారు. వాగుఉధృతితో కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. నీటి ఉధృతి పెరిగితే సమాచారం ఇవ్వాలని సూచించారు. వరద ఉన్న సమయంలో వాగు దాటొద్దని చెప్పారు. ఆయనవెంట ఆర్ఐ సునీత, గ్రామకార్యదర్శి ఉన్నారు.

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉట్నూర్ మండల కార్యవర్గం

ఉట్నూర్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ గురువారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా చిక్రం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా మరప చంద్రబాన్, ఉపాధ్యక్షులుగా ఆర్.రాధా, గజానన్, కార్యదర్శులుగా మోతిరాం, రాజవ్వ, డి.బాబు, జిల్లా కౌన్సిలర్లుగా ముడుగుశామ్యూల్, రాథోడ్‌రవిత, బిప్రకాష్, సి.వీరయ్యలు ఎన్నిక అయ్యారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోథ్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర సబ్‌స్టేషన్‌పైన బుధవారం రాత్రి పిడుగు పడడంతో విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయాన్ని తెలుసుకున్న అధికారులు వర్షంలోనే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

అత్యవసర సేవల సిబ్బంది నెంబర్లతో ఫ్లెక్సీల ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉండేలా డాక్టర్ హెచ్‌వీ వజే సేవాసమితి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

కొలువుదీరిన గణనాథులు

- కొలువుదీరిన గణనాథులు
- ప్రత్యేక పూజలందుకున్న ఆదిదేవుడు
- మట్టి వినాయకుడికి ఏఎస్పీ పూజలు

ఇచ్చోడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఆదిదేవుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలకు మండపాలను ముస్తాబు చేసి చిన్నారులు, యువకులు, పెద్దలు ఉత్సవాలను ప్రారంభించారు.

ఉట్నూర్: ఉట్నూర్ ఏజెన్సీలోని గ్రామాల్లోని వీధివీధినా వినాయక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని హనుమాన్ మందిరంలో సార్వజినక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రదర్శించగా పట్టణంలోని వేణునగర్ లక్కారం, గంగన్నపేట, నవోదయనగర్,హనుమాన్‌నగర్, విద్యానగర్, పోచమ్మవాడ, సేవాదాస్‌నగర్ ప్రాంతాలలో మండపాలు ఏర్పాటుచేసి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వినాయక చవితి సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌కు మట్టిగణేష్ విగ్రహాన్ని అందించారు.



హిందూవాహిని గణేష్ మండపంలో తల్లి ఒడిలో కూర్చున్న వినాయకుడు

తలమడుగు: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. భారీ వర్షంలోనూ గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. ఒకరోజు గణపతిని ఇంట్లో ప్రతిష్ఠించి పూజలు చేసి వాగులో నిమజ్జనం చేశారు.

ఆదిలాబాద్ రూరల్: పట్టణంలో వినాయక చవితి శోభ సంతరించుకుంది. గురువారం పట్టణానికి సమీపంలోని చాందా టీ వాగు వద్ద భక్తుల సందడి కనిపించింది. వాగు ఒడ్డు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రతిమలను నిమజ్జనం చేశారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని తన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దంపతులు గణపతి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేశారు. గురువారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి ప్రతిష్ఠించిన విగ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ భారీవర్షాల నేపథ్యంలో అందరూ జాగ్రత్తలు పాటించాలన్నారు.

మావల: మండలంలోని ఆయాగ్రామాల్లో గణ నాథులు కొలువు దీరారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నిఖిత -ప్రశాంత్ రెడ్డి, సాయి చందన రెడ్డిలు పాల్గొన్నారు.

బోథ్: సోనాల మండలకేంద్రంలో ఈ ఏడాది సైతం హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతిని ప్రతిష్ఠాపించారు. ప్లాస్టిక్ వినియోగం లేకుండా పూజలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో చేపట్టరు. పట్టణంలోని అశోక్‌రోడ్, వినాయక్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ తదితర ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాల విక్రయాల దుకాణాలు భారీగా వెలిశాయి. సమస్యాత్మక ప్రాంతాలను ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలించారు. పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వినాయకుడిని ప్రతిష్ఠించగా.. ఎమ్మెల్యే పాయల్‌శంకర్ పూజలుచేశారు. ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో గణనాథుడికి ఎస్పీ అఖిల్‌మహాజన్ పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు ఉన్నారు. అంబేద్కర్ చౌక్‌లో భక్తులకు మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ మనిషా ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



ప్రధానకూడళ్లలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఏఎస్పీ

వరద బాధితురాలికి అండగా..

ఉట్నూర్: మండలంలోని శ్యాంపూర్‌లోని దుర్పతబాయి అనే ఒంటరి మహిళకు విఘ్నహర్త గణేష్ మండలిసభ్యులు నెలసరి సరిపడా నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. కురుస్తున్న వర్షాలతో ఇంట్లో వరద చేరి అన్నీ కోల్పోయింది. దీంతో ఆమెకు అండగా ఉండాలని భావించిన యువకులు నిత్యావసర సరుకులను విరాళంగా అందించారు. కార్యక్రమంలో సభ్యులు అంజన్న, రాజ్‌కుమార్, మల్లికార్జున, దీపక్, మహేశ్, తదితరులున్నారు.

ప్రజాసేవ భవన్‌లో వినాయకుడికి పూజలు

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్‌లో భక్తుల సందడి నెలకొంది. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ప్రజాసేవ భవన్ హాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి విఘ్నేశ్వరునికి వేద పండితుల శాస్త్రోక్త మంత్రాలతో తొలి పూజ నిర్వహించారు. ప్రజలందరూ సిరిసంపదలు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు సుఖశాంతులతో జీవించాలని కంది శ్రీనివాస్‌రెడ్డి వినాయకుడిని ప్రార్థించారు. పూజ అనంతరం లంబోదరునికి ఇష్టమైన ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. పెద్దఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, కంది శ్రీనివాస రెడ్డి మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పూజలో పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆగి ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్

● సీఐ, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

జైనథ్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని డొల్లార పెన్‌గంగా నది దగ్గర గురువారం ఉదయం ఆగి ఉన్న పోలీసు వాహనాన్ని కంటెనర్ ఢీకొట్టడంతో సీఐ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ మరియు డ్రైవర్ ఏఆర్ కానిస్టేబుల్ షబ్బీర్‌తో కలిసి పోలీసు వాహనం నెంబర్ టీఎస్09పీఏ0714లో గణేష్ నిమజ్జనం మరియు వరదను సమీక్షించడానికి మండలంలోని డొల్లర పెన్‌గంగా బ్రిడ్జి దగ్గర వరదను పరిశీలిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న కంటెనర్ నెంబర్ ఎంహెచ్46బి ఎం4265 కంటెనర్ ఆగి ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొట్టడంతో పోలీసు వాహనం నుజ్జునుజ్జయింది. దీంతో సీఐ సాయినాథ్ (42) డ్రైవర్ షబ్బీర్(32) తలకు కాళ్లు చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. సీఐ మరియు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆసుపత్రికి వెళ్లి సీఐని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డిలతో పాటు జైనథ్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితాను మార్చిన నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ బండారి రాజు

ఇచ్చోడ, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): నకిలీ నివాస ధృవీకరణ పత్రాలు సృష్టించి ఓటరు జాబితాలో పేర్లు మార్చిన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని అడేగామ(బీ) గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కదం వనిత, ఆమె భర్త కదం సుభాష్‌ల పేర్లను వారి గ్రామ ఓటరు జాబితాలో కాకుండా ఇచ్చోడ ఓటరు జాబితాలో జతపరచడంతో బాధితులు జిల్లా, ఉన్నతాధికారులను సంప్రందించారు. ఈ విషయంపై పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా నిందితులైన కదం విశాల్, సిందే అచ్చుత్, కదం ధనరాజ్‌లు నకిలీ నివాస ధృవపత్రాలను తయారుచేసి ఎలక్ట్రోరల్ పోర్టల్‌లో ఫారమ్-8 అప్లై చేసి రెవెన్యూ అధికారుల సహాయంతో ఓటుహక్కును ఇచ్చోడకు మార్చారు. ఈ తంతు యథావిధిగా జరగడానికి సహకారించిన ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయ ఎంఆర్ఐ హుస్సేన్ పాత్ర కీలకమైంది. దీంతో ప్రాథమిక విచారణ అనంతరం ఆర్ఐ హుస్సెన్‌తో సహా మరో ముగ్గురు నిందితులైన కదం విశాల్, కదం ధనరాజ్, సిందే అచ్చుత్‌లను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. నకిలీ నివాస ధృవపత్రాలను ఫోర్జరీలు చేసి కల్యాణలక్ష్మికి సంబంధించిన చెక్కుల రూపంలో నగదు.. కేంద్రపోలీసు బలగాలల్లో ఉద్యోగాలను సైతం ఇచ్చోడ మండల కేంద్రంగా కేటుగాళ్లు సాధించారు. ఇదిలా ఉండగా గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కడ గెలుపొందుతారోనని ఊహించి ఓటర్ లిస్టులో పేర్లు మార్పులు చేసి ఎన్నికల్లో తమకు పోటీ అనేదే ఉండకుండా చేయాలనే ఉద్దేశ్యంతో ఇలాంటి మార్పులు చేసినట్లు బాధితులు, పలువురు పేర్కొంటున్నారు. వీటికి కొందరు అధికారులు తమ తోడ్పాటునందిస్తుండడంతో ఇలాంటి నకిలీ వ్యక్తులు ఇంకా చెలామణి అవుతున్నారని పలువురు అనుమానిస్తున్నారు.

జలదిగ్బంధంలో గ్రామాలు

- తరోడ(బీ) గిమ్మా లోలెవల్ బ్రిడ్జి వద్ద పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు
- వాగులో కొట్టుకు మేకలు, గొర్రెలు
- నీట మునిగిన పత్తి, సోయా పంటలు



గిమ్మాలో లెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద



పొంగిపొర్లుతున్న తలమడుగు వాగు

జైనథ్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీవర్షాలు కురుస్తున్నాయి. భోరజ్ మండలంలోని గిమ్మాలోని లోలెవల్ బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో కారట, ఆకలి, కేదార్పూర్ గ్రామస్తులకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోగా గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతోపాటు తర్నం లోలెవల్‌బ్రిడ్జిపై భారీగా వరద ప్రవహించడంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కామాయి, మండగడ, పెండల్వాడ గ్రామాలు వరద నీటిలో జలదిగ్బంలో ఉన్నాయి. సాత్నాల, పెన్‌గంగా నదులు ఉగ్రరూపంలో ప్రవహించడంతో మాండగడ, పెండల్వాడ, క్నాపీ, కరంజి, ఆకలి, కోరట మొదలగు గ్రామాలకు సోయా, పత్తి, కంది, జొన్నపంటలు నీట మునిగాయి. సాత్నాల మండలంలోని పార్డి(కే) నాలుగు గొర్రెలు, రెండుమేకలు పార్డీ(కే) వాగు వరదలో కొట్టుకపోయి మృతిచెందాయి. జైనథ్‌లోని పలు ఇళ్లలో భారీగా వరద నీరు చేరడంతో అష్టకష్టలు ప్రజలు పడతున్నారు.

దేవాపూర్ వద్ద కోతకు గురైన రోడ్డు

తలమడుగు: మండలంలో మధ్యాహ్నం మంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు ఉంగి ప్రవహించాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లాకేంద్రం నుంచి మండల కేంద్రం వరకు వచ్చేప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. సుంకిడి భీమన్నభాగం, తలమడుగు పెద్దవాగు దేవాపూర్‌వాగు, డోర్లీ వాగులు పొంగి ప్రవహించాయి. అదేవిధంగా దేవాపూర్ చెరువు సమీపంలో రహదారి కోతకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

గ్రామాలకు పరిమితమైన ప్రజలు

బోథ్: మండలంలో కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. వర్షం కారణంగా ప్రజలు తమ గ్రామాలను విడిచి బయటకు రాలేకపోయారు. మరోవైపు పాత కరత్వాడ, నక్కలవాడ, మర్లపల్లి, దన్నూర్ తదితర గ్రామాల సమీపంలో వాగులు పొంగి ప్రవహించడంతో గ్రామం బయటకు రాలేకపోతున్నారు. అధికారులు గ్రామాలలో కూలిన ఇండ్లు, కోతకు గురైన పంటల వివరాలను సేకరించి నష్టపరిహారం అందేలా చూడాల్సిన అవసరం ఉంది.

పిడుగుపాటు: రైతుకు గాయాలు

ఉట్నూర్: మండలంలోని ముసళ్లపాడు గ్రామానికి చెందిన గిరిజన రైతు కోట్నాక్‌ఇస్సు గురువారం సాయంత్రం పంట చేనులో ఉండగా పిడుగు పడింది. దీంతో రైతుకు స్వల్పగాయాలకు గురైనట్లు గ్రామస్థులు తెలిపారు.

మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడడం, ఆమె ప్రతిఘటించడంతో ఆమెపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్ట్ ప్రత్యేక న్యాయాధికారి కుమార్ వివేక్ గురువారం తీర్పు ఇచ్చారు. దేవుగుడలోని తన సోదరుడికి రాఖీ కట్టేందుకు వచ్చిన ఓ మహిళ సోయం గూడకు వెళ్లే సమయంలో షేక్ ముక్దుమ్ ఆటోలో తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆటోలో ఎక్కేందుకు సదరు మహిళ నిరాకరించినా వెళ్లే మార్గంలో మరో ఇద్దరు మహిళలు వేచి చూస్తున్నారని నమ్మించి ఆటోలో తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించగా మహిళ ప్రతిఘటించడంతో ఇనుపరాడ్‌తో కొట్టి హత్యాయత్నం చేశాడు. ఈ కేసుపై అప్పట్లో ఆసిఫాబాద్, జైనూర్‌లో పెద్దఎత్తున ఆందోళనలు వెల్లువెత్తాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపిన పోలీసు అధికారులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పీపీ రమణరెడ్డి 28మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్ట్ ప్రత్యేక న్యాయాధికారి షేక్ ముక్దుమ్‌కు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు.

వాగులో చిక్కుకున్న రైతులను కాపాడిన పోలీసులు

ఉట్నూర్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని ఎంకా కాలనీకి చెందిన రైతులు భార్యాభర్తలను వాగు పరివాహక ప్రాంతంలో చిక్కుకోగా వారిని పోలీసులు గురువారం సాయంత్రం కాపాడారు. ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం మేరకు.. ఎంకా కాలానికి చెందిన రైతులు ప్రహ్లద్, శకుంతల గురువారం సాయంత్రం పంటచెనుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో కురిసిన భారీవర్షానికి నడ్డంగూడ సమీపంలో ఉన్నవాగు పొంగడంతో భార్యాభర్తలు ఇద్దరు వాగు ఒడ్డున చిక్కుకుపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. ఫైర్ సిబ్బందిని వెంట పెట్టుకొని ఘటన స్థలానికి చేరుకున్నారు. వారికి తాళ్లుకట్టి బెలూన్‌ల సహాయంతో క్షేమంగా ఒడ్డుకు చేర్చారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన



వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

మావల, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాలను ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు దృష్ట్యే జిల్లా కేంద్రంలోని హరిటం నగర్ ప్రాంతానికి వెళ్లే రోడ్డు తెగిపోవడంతో ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గురువారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రజలు అత్యవసర సమయంలో తప్ప బయటకు రాకూడదని అన్నారు. రోడ్డు కల్వర్టుల పైనుండి ప్రవహించే సందర్భంలో వాటిని దాటకుండా ఉండాలని, వేరే మార్గాలను ఉపయోగించి పట్టణానికి చేరు కోవాలని సూచించారు. ప్రజలు దాటకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నా మని వెల్లడించారు. కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

జోరు వాన

(5వ పేజీ తరువాయి..)

వదులుతున్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో సాత్నాల ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి దిగువకు 7305 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే కోర్పా-చనకా బ్యారేజి వద్ద 903.800 క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టుల దిగువ ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురు స్తున్న భారీవర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. అలాగే చిక్‌మన్ ప్రాజెక్టుతో పాటు పలు చెరువులు, కుంటలు పొంగి ప్రవహిస్తున్నాయి. బజార్‌హత్నూర్‌లోని దేగామ ప్రాజెక్టు నిండు కు ండను తలపిస్తోంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాలతో వానకాల పంటలకు ఇక ఢోకా లేదన్న భావనతో అన్నదాతలు ఉన్న ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప ంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు అంతరాయం

భారీ వర్షాలకు లోలెవల్ వంతెనలు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. జిల్లాకేంద్రంలోని బట్టిసావర్గాం, సుభాష్‌నగర్‌కు వెళ్లే మార్గంలో లోలెవల్ వంతెనలపై నుంచి వరద ఉప్పొంగి ప్రవహించడంతో పలు కాలనీలకు రాకపోకలు నిలిచాయి. జైనథ్ మండలం తర్నం వద్ద లోలెవల్ వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో బేల, మహారాష్ట్ర ప్రాం తాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ఈ రూట్లో వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపి వేశారు. అలాగే 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపుకు వెళ్లే భారీ వాహనాలను నేరడిగొండ టోల్‌ప్లాజా వద్ద నిలిపేశారు. కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి కొట్టుకుపోవడంతో అటువైపు వెళ్లే వాహనాలను నిలిపి వేశారు. అలాగే తాంసి మండలం హస్నాపూర్ గ్రామం వద్ద లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించడంతో మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి పై గంటల పాటు రాకపోకలు నిలిచి పోయాయి. తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలోకి వరద చేరడంతో అంతరాష్ట్ర రహదారిపై గ్రామస్థులు రాస్తారోకోకు దిగారు. దీంతో గంటల తరబడి రాకపోకలు నిలిచాయి. లోతట్టు కల్వర్టులను దాటేందుకు వీలు లేక పలుమారుమూల గ్రామాల ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పంట చేన్లు నీట మునగడంతో పత్తి, సోయా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల వరదల దాటికి పంట పొలాలు కోతకు గురయ్యాయి. భారీవర్షాల కారణంగా 30 వరకు ఆదిలాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపివేశారు.

నకిలీ ధృవీకరణ పత్రాలు ఇప్పించిన ఇద్దరిపై కేసు

ఇంద్రవెల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ ధృవీకరణ పత్రాలు ఇప్పించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన జతిన్‌సింగ్ సెంట్రల్ ఫోర్సులో ఉద్యోగం కోసం ఇంద్రవెల్లి లోకల్ చిరునామాపై రెసిడెన్స్ సర్టిఫికెట్ అవసరమైంది. దీంతో మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడ గ్రామానికి చెందిన గేడం భరత్‌ని కలిసి లోకల్ రెసిడెన్స్ సర్టిఫికెట్ కావాలని అడిగాడు. భరత్ డబ్బులకు ఆశపడి వారితో ఒప్పందం కుదుర్చుకుని వారి వద్ద రూ.15వేలు తీసుకుని జతిన్‌సింగ్ ఆధార్‌కార్డుపై రాజస్థాన్ అడ్రస్‌కు బదులుగా ఇంటినెంబర్ 1-42 కొబ్బయ్‌గూడ ఇంద్రవెల్లి అని మార్చి ఇంద్రవెల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి జతిన్‌సింగ్ యొక్క రెసిడెన్స్ సర్టిఫికెట్ పొందాడు. విషయం తెలుసుకున్న భీంనగర్‌కు చెందిన ఆచార్యదత్త గేడం భరత్‌ను కలిసి తనకు అంతా తెలుసని ఈ విషయం ఎవరికీ చెప్పొద్దంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో జతిన్‌సింగ్, భరత్‌సింగ్ దత్తకు రూ.10వేలు ఇప్పించాడు. ఇంద్రవెల్లి ఎస్‌బీ కానిస్టేబుల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్‌లు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఎస్పీ

భైంసా రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్ గ్రామాల్లో బుధవారం 31 సీసీ కెమెరాలు ఎస్పీ జానకి షర్మిల ప్రారంభించారు. తిమ్మాపూర్‌లో రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని అవగాహన కల్పిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ డా.జి. జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ సమ్మయ్య, భైంసా రూరల్ ఎస్సై శంకర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కుభీర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హల్దా గ్రామంలో మంగళవారం చోరి జరిగినట్లు సరం మల్లేష్ బుధవారం కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం లక్ష్మణ్‌చందా మండలంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండగా, ఇంట్లోని రెండు గ్రాముల బంగారు కమ్మలు, రెండు గ్రాముల మాటీలు చోరీ అయినట్లుగా ఫిర్యాదులో తెలిపాడు. గురువారం పోలీసుల హల్దా గ్రామానికి వెళ్లగా ఓ యువకుడు పరుగు తీయడంతో పోలీసులు పట్టుకొని విచారణ జరిపారు. దొంగిలించిన ఆభరణాలు తీసి ఇచ్చినట్లు వివరించారు. నిందితుడు విఠల్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జరిమానా

ఖానాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డుగా పనిచేస్తున్న వ్యక్తి విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరికి రూ.10,000ల జరిమానా పడినట్లు ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 సంవత్సరంలో కడెం మండలం ఆకొండపేట్ గ్రామానికి చెందిన జాడిపోశం అనేవ్యక్తి వ్యక్తి హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆయనను కొట్టి గాయపరిచాడు. గతంలో కడెం పోలీస్‌స్టేషన్‌లో జాడి పోశంపై కేషు దర్యాప్తు చేపట్టారు. కేసుల విచారణ సంబంధిత సాక్షాలు ఆధారాలను పరిశీలించిన అనంతరం గురువారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్ట్-ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి శ్రీవాణి నిందితుడికి రూ.10,000ల జరిమానా విధిస్తూ తీర్పును వెలువడించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.వినోద్ రావు విచారణ అధికారులు ఎస్సై జి. సతీష్, ఎస్సై జే. రాము డ్యూటీ అధికారులు ఏఎస్సై డల్లు సింగ్, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శేఖర్‌లను ఎస్పీ అభినందించారు.

కూలిన కేజీబీవీ ప్రహరీ - పరిశీలించిన డీఈవో

లక్ష్మణచాంద, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల కస్తూరిభా గాంధీ పాఠశాల ప్రహరీ భారీవర్షాల కారణంగా గురువారం కూలింది. విద్యాశాఖ అధికారి పి.రామారావు కూలిన ఈ గోడను పరిశీలించారు. కిచెన్ గదిని, కిచెన్ స్టోర్, తగతి గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ.. అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్.అశోక్ వర్మ, డీసీఈబీ ఇన్‌చార్జి భాను ప్రకాష్, స్పెషల్ ఆఫీసర్ నవిత, సీఆర్పీలున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

దస్తురాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వరద ముంపు గ్రామాలు రాంపూర్, బుట్టాపూర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గోదావరి ఉధృత ప్రవాహం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో బాధితులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆందోళన వద్దు .. ప్రభుత్వం అండగా ఉంది

భైంసా, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల మూలంగా కష్టనష్టాల పాలైన వారందరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ , మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావ్ దృష్టికి తీసుకవెళ్లినట్లుగా వివరించారు.

ఘనంగా వినాయక చవితి



కుంటాలలో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

సారంగాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు జాం, స్వర్ణ, కౌట్ల(బీ), బీరవెల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో బుధవారం ఘనంగా వినాయక చవితి పండుగను నిర్వహించారు. గ్రామాలలో పండుగ సందడి నెలకొంది.

కుంటాల : కుంటాలలో బుధవారం వినాయకచవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు ఈ విగ్రహాలకు 5, 7, 9 రోజులు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి వేళల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టి అనంతరం సమీప చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేస్తారు.

ముథోల్ : వినాయక చవితిని పురస్కరించుకొని ప్రజలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్య ప్రతిమలు బుధవారం తొలి పూజలందుకున్నాయి. శరణు శరణు లంబోదర అంటూ భక్తులు తమ ఇళ్లల్లో పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

భైంసా: మున్సిపల్ కేంద్రమైన భైంసాలో భక్తుల కోలాహలం మధ్య బుధవారం వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శోభాయమానంగా తీర్చిదిద్దబడిన మండపాల్లో గణనాథులు కొలువు తీరి భక్తుల పూజలు అందుకున్నారు. పట్టణ పరిధిలో 150 పైగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. ఈ వేడుకల్లో పర్యావరణ పరిరక్షణపై వివిధ సంఘాలు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పెద్ద ఎత్తును ప్రచారం చేపట్టడంతో మట్టి ప్రతిమలను అధికంగానే ప్రతిష్ఠించారు. బుధవారం ఉదయం వేళలో ఆయా మండలిల సభ్యులు భాజభజంత్రీల మధ్య వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు గాను శోభయాత్రంగా తరలించారు. మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణను నిర్వహించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాలకు చెంది భక్తులు బుధవారం తమ తమ నివాసగృహాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను గురువారం స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. ఉదయం వేళల్లో నివాస గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్ర ద్వారా తరలివచ్చి ప్రాజెక్టులో విగ్రహాలను నిమజ్జనం నిర్వహించారు.

ఘనంగా ముథోల్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



భైంసా ఏరియా ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే



భైంసాలో ఎమ్మెల్యేకు జ్ఞాపికలను బహుకరిస్తున్న దృశ్యం

భైంసా, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జన్మదిన వేడుకలు గురువారం నియోజకవర్గ బీజేపీ శ్రేణులు, అభిమానులు,అనుచరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రధాన రోడ్డు మార్గాల్లో పండ్లు, మిఠాయిల పంపిణీని చేపట్టారు. సిరాల ప్రాజెక్టు వద్ద ఆయకట్టు రైతాంగం, పార్టీ శ్రేణులు, అభిమానులు,అనుచరగణం ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మొక్కలను నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేపట్టారు. భైంసాలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ అభిషేకాలు, అర్చనలు, కుంకుమాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజైవైఎం ప్రతినిధి గంగాప్రసాద్ తన రక్తంతో ఎమ్మెల్యే చిత్ర పటాన్ని గీయించి కానుకగా అందచేశారు. శ్రీ మహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యదర్శి ముథోల్ నియోజక వర్గ పటంలో ఎమ్మెల్యే చిత్రాన్ని ప్రత్యేకంగా వేయించి జ్ఞాపికగా బహుకరించారు. ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో మహారాష్ట్రకు చెందిన పురుషోత్తం మహారాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీర్తన కార్యక్రమానికి నియోజక వర్గ పరిదిలోని వివిధ ప్రాంతాల నుంచి రెండున్నర వేలకు పైగా మంది పార్టీ శ్రేణులు, అభిమానులు,అనుచరులు హజరయ్యారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని కష్టనష్టాలపాలైన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కాలయాపనకు తావులేకుండా సత్వరమే ఆదుకునే చర్యలు చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కుండపోతగా వర్షాలు కురియడంతో అధిక శాతం ప్రాంతాల్లోని పంటలు నీట మునగడం,పైర్లు దెబ్బతినడం, పంటచేలు కోతకు గురవ్వడం జరిగిందన్నారు.

కుంటాల : ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ పుట్టిన రోజు వేడుకలు ఓలా గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పేదల మనిషి ఎమ్మెల్యే రామరావు పటేల్ అని మండల అధ్యక్షుడు పసుల నవీన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎల్ల వేళల పేదల సంక్షేమం కోరుకున్న వ్యక్తి అయినందు వల్లనే తన పుట్టిన రోజు వేడుకల పేద ప్రజల మధ్యన జరుపుకోవాలనే ఉద్దేశంతో గురువారం ఆయన స్వయంగా ఓలా గ్రామానికి చెందిన సామాన్య కార్యకర్త అయిన సాధు ప్రభాకర్ ఇంట్లో ఆయన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారన్నారన్నారు. పేదల పెన్నిధి రామరావు పటేల్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని అక్కడి పేద ప్రజలు దీవించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి పేద ప్రజలతో సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అప్క, గజ్జారాం, రమణ రావు, మండల అధ్యక్షుడు పసుల నవీన్, మాజీ ఎంపీటీసీలు కట్ట రవి, సుధాకర్, గౌస్, నాయకులు రాజేష్ బాబు, సాంప్లీ రమేష్, మేసినేని వెంకట్ రావు, సాధుప్రభాకర్ ఉన్నారు.

తానూర్ : ముథోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే రామరావుపాటిల్ జన్మదిన వేడుకలను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులలు పుండ్ర లక్ష్మణ్, ఉపాధ్యక్షులు బాలాజీయాదవ్, మాజీ సర్పంచ్ మారుతి, మాధవరావు, అల్తాఫ్, సాయినాథ్, సోమేశ్, గణేష్, సరస్వతి, నాయకులు కార్యకర్తలు , ప్రజలు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు : జిల్లా ప్రత్యేక అధికారి

నిర్మల్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి ఆయన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా పట్టణంలోని బోయవాడలో పర్యటించి, వర్షపు నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలతో మాట్లాడారు. ఇళ్లల్లోకి నీరు చేరిన కుటుంబాలకు తక్షణ సహాయం అందజేస్తామని, వరద నీటిలో బియ్యం నాని పోవడంతో వారికి బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు కూలిన వంతెనలు, ఆవాసాలు

లక్ష్మణచాంద, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం కురిసిన భారీ వర్షాలకు వంతెనలు కూలాయి. ఆవాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. చామన్‌పెల్లి, రాచాపూర్, మల్లాపూర్, వడ్యాల్ తండా, వడ్యాల్ గ్రామాల్లో ఇళ్లు కూలి పాక్షికంగా దెబ్బతినగా ధర్మారం, సోన్ గ్రామాల మధ్య గల వంతెన కూలింది. తిరుపెల్లి గ్రామం వద్ద గల గోదావరి నదిపై గల వంతెన పాక్షికంగా దెబ్బతిన్నది. వంతెనలకు అడ్డంగా చెట్లు చెదారం చేరి గ్రామంలోని ఆవాసాలకు నీరు చేరే పరిస్థితి తలెత్తటంతో స్థానిక మాజీ సర్పంచ్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గాండ్ల చిన్నయ్యలు సహాయక చర్యలు చేపట్టి క్లియర్ చేశారు.

తెలుగు సాహిత్యంలో శతకాలకు ప్రత్యేకస్థానం

భైంసా, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య రంగంలో శతకాలకు ప్రత్యేక స్థానం ఉందని, శతకాలు సమాజాన్ని తీర్చిదిద్దుతాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డా.ముష్కం రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. గురువారం భైంసాలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో ప్రముఖ కవి వినాయకరావ్ రచించిన పండరీష శతకం పుస్తక అవిష్కణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో శ్రీ గౌతమి హైస్కూల్ కరస్పాండెంట్ రేగుంట రవీందర్‌తో పాటు పలువురు కవులు,కళాకారులు పాల్గొన్నారు.

మస్కాపూర్ కేజీబీవీ తనిఖీ

ఖానాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా చర్యలు చేపట్టాలని నిర్మల్ డీఈవో రామారావు అన్నారు. గురువారం ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు పాఠశాలలో పరిస్థితిని సమీక్షించాలని ఎంఈవో సంధ్యారాణి ఆదేశించారు. ఆయన వెంట కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత తదితరులున్నారు.

ఇరిగేషన్ కాలువ అక్రమ నిర్మాణం కూల్చివేత

నర్సాపూర్(జి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇరిగేషన్ కాలువను అక్రమంగా ఆక్రమిచి నిర్మించిన ప్రహరీ గోడను నర్సాపూర్ గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. అక్రమ కట్టడాల తొలగింపులో భాగగంగా మండల పంచాయతీ అధికారి ఎల్. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు ఈ కూల్చివేత జరిగింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది జేసీబీ సహాయంతో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండాలి : డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బుధవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా అందరూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. లోతట్టు ప్రాంత కాలనీ ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

కుంటాల, ఆగస్టు, 28 : (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో డీఎల్‌పీవో సుదర్శన్ ఆధ్వర్యంలో ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈ నెల30 వరకు ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఓటర్లు తమ సిబ్బందికి తెలియజేయాలని ఆయన తెలిపారు.

వాగు ఉప్పొంగిందంటే

స్కూల్ మూసేయాల్సిందే!

- అవస్థలు పడిన విద్యార్థులు
- వానాకాలం వచ్చిందంటే ప్రతియేటా తప్పని తిప్పలు
- తాజాగా తెగిపోయిన రెంకోని వాగు తాత్కాలిక వంతెన

ఖానాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వర్షం పడింది అంటే చాలు ఆ పాఠశాలకు అనధికారిక సెలవులు ప్రకటించడం గత కొన్నేళ్లుగా పారిపాటిగా మారింది. ఎప్పుడు వర్షం పడుతుందో అప్పుడు ఆ పాఠశాలలో చదివే విద్యార్థులను బయటకు తరలించడం కూడా ఉపాధ్యాయులకు కత్తి మీద సాము లాగా మారుతుంది. మండల కేంద్రంలోని హైటెక్ సిటీలో గల షైనార్డీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రస్తుతం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కనీసం రోడ్డు సౌకర్యం లేని భవనంలో పాఠశాలను కొనసాగించడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ పాఠశాలకు అనధికారిక సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. తాజాగా బుధవారం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి రెంకోని వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఈ వాగులో వస్తున్న వరద ఉధృతికి హైటెక్ సిటీకి వెళ్లేందుకు నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఖానాపూర్ పట్టణం నుంచి హైటెక్ సిటీకి వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతినడంతో పాఠశాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులకు ఉప యోగించే నిత్యావసర సరుకులు సైతం వెళ్లేలేని పరిస్థితి తలెత్తింది. ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా పాఠశాలకు వెళ్లలేక రెంకోని వాగులు ఇవతలి వైపే ఉండిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులను మరో మార్గం గుండా అతి కష్టం మీద వాగు దాటించేందుకుఅధికారులు శ్రమించారు.



విద్యార్థులను వాగు దాటిస్తూ ఇంటికి తరలిస్తున్న దృశ్యం

మత్తడి వాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



రెండు గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

- 28 వేల క్యూసెక్కుల నీటి విడుదల

తాంసి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు, చెరువులన్నీ పూర్తిగా నిండిపోయాయి. కుండపోతగా కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లోకి సైతం భారీగా వరద నీరు వచ్చి చేరింది. మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా గురువారం మధ్యాహ్ననికి 277.40 మీటర్లకు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన సంబంధిత అధికారులు నాలుగు గేట్లు ఎత్తివేశారు. 22280 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 22 వేల 800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని అధికారులు పేర్కొన్నారు. మళ్లీ వర్షం కురిస్తే ఐదు గేట్లు ఎత్తివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరు సహకరించాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పూరి గుడిసెలు సైతం నీలమట్టమయ్యాయి.

నేరడిగొండ మండలంలో ఉప్పొంగిన వాగులు

నేరడిగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం ఉప్పొంగిన వాగులు, వంకలు గురువారం మండలంలో భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు ఉప్పొంగి కడెం నడిపరివాహక ప్రాంతాలలో పంటలకు నష్టవాటిల్లింది. సేవదాస్ నగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. కుప్టి వద్ద కడెం నది ఉగ్రరూపం దాల్చింది. కోర్టికల్. కుంటాల జలపాతాలకు భారీ వరదలు వచ్చాయి. కుండపోత వర్షాల కారణంగా జలపాతం ఉగ్రరూపం దాల్చింది. వరద నీరు పోటెత్తింది, అటవీ శాఖ.పోలీసులు ఎవరూ జలపాతం వైపు వెళ్ళకుండా ఆంక్షలు విధించారు. తహసీల్దార్ కలీం, ఎంపీడీవో శేఖర్, ఎస్ఐ ఇమ్రాన్‌లు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



కుంటాలకు పోటెత్తిన వరద



సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపడుతున్న ఖోడద్ వరద నీటి ముంపు బాధితులు

వరద నీటి సమస్యను పరిష్కరించాలని

అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో

- కిలో మీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు
- రూ.20 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి అధికారులు నిధులు మంజూరుతో రాస్తారోకో విరమణ

తలమడుగు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాన్ని లెక్కచేయకుండా తమ వరద నీటి సమస్యను పరిష్కరించాలని గురువారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఖోడద్ గ్రామస్తులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వరద నీటి ముంపు బాధితులు, గ్రామస్తులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం వరద నీటితో ఇబ్బందులు పడుతున్న ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. గత రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలతో ఇళ్లలోకి నీరు వచి నిత్యవసర వస్తువులతో పాటు ఆహార పదార్థాలను తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 ఇళ్లవరకు వర్షపు నీటిలోనే ము నిగిపోయాయని బాధితులు వాపోయారు. ఈ విషయమై సం బంధిత శాఖ అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సమీపంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై కల్వర్టు నిర్మాణం చేపడితే వరద ముంపు రాకుంటా ఉంటుందన్నారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యే వరకు జిల్లా అధికారుల అచ్చే వరకు రాస్తారోకో చేపడతామని బీస్మించుకొని కూర్చోవడంతో తలమడుగు తహసీల్దార్ రాజమోహన్, ఎస్సై రాధిక జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించి అంతర్ రాష్ట్ర రహదారిపై కల్వర్టు నిర్మాణం కోసం వెంటనే జిల్లా ఉన్నతాధికారులు రూ20 లక్షల నిధులు మంజూరు చేయడంతో రాస్తారోకోను నిర్మించారు. పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కాగా అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దాదాపు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అంబులెన్స్‌కు దారి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్న గ్రామస్థులు. మరోపక్క భారీ వర్షం కురవడంతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు. ఇందులో వరద నీటి ముంపు బాధితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వరద నీటి ముంపు బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజమోహన్

పొంగిపొర్లిన హస్నాపూర్ వాగు



వాగు పొంగడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయిన దృశ్యం

- అంతరాష్ట్ర రహదారిపై ఏడు గంటల పాటు రాకపోకలకు అంతరాయం

తాంసి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలోని అంతర్రాష్ట్ర రహదారి ప్రక్కన ఉన్న హస్నాపూర్ వాగు పొంగిపొర్లింది. గురువారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షం వల్ల ఈ వాగు పొంగి పోర్లడంతో సుమారు ఏడు గంటల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. పనులకు వెళ్లే వారు ఈ వాహనాల్లో చిక్కుకోవడంతో ఎటు పోలేక పోయా రు. తాంసిలో ఉన్న బ్యాంకు, ఇతర కార్యాలయాలకు సకాలంలో అధికారులు చేరుకోలేకపోయారు. దీంతో గురువారం సాయంత్రం వరకు కూడా ఎలాంటి పనులు జరగలేదు.

పొంగిన వాగులు, వంకలు

భీంపూర్: మండలంలో గురువారం కురిసిన వర్షానికి పిప్పల్కోటి, నిపాని, వాడుర్, అంతర్గవ్, గ్రామాల నడుమ ఉన్న వాగులు, లో లెవెల్ వంతెనలు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అటు పంట చెల్లలో వరద నీరు చేరడంతో పంటలు మునిగిపోయాయి.

రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న చింతల బోరి వాగు

బోథ్: సోనాల మండలంలో భారీ వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. చింతలపూడి సమీపంలోని వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 12 గ్రామాల ప్రజలు ఈ వాగు వల్ల ఇబ్బందులకు గురయ్యారు. అంతేగాక మండలంలోని చింతల బోరి, గొల్లపూర్ చెరువులు నిండు కుండగా మారాయి. సమీప గ్రామాల ప్రజలు భయం భయంగా కాలంవెల్లదీస్తున్నారు. భారీ వర్షాల కారణంగా తమ పొలాలలో నీరు నిలిచి పంటలు చెడిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



నిపాని వద్ద నిండుగా పారుతున్న వాగు



సోనాల మండలంలో ఉప్పొంగిన వాగులు

ఉప్పొంగిన ధనూరు వాగు

- వరద ఉధృతికి కొట్టుకు పోయిన ద్విచక్ర వాహనం
- బయటపడ్డ యువకుడు

బోథ్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సా యంత్రం భారీ వర్షం కురవడంతో దన్నూర్ గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగి ప్రవహించింది. అయితే వాగు ఉధృతిని గుర్తించని శంకర్ అనే యువకుడు వరద నీటిలో తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అంతలోని వాగు ప్రవాహం పెరగడంతో యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయారు. ఇదే విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీసాయిలతో కలిసి ఘటనా స్థలానికి చేరుకోవడం జరిగింది. యువకుని కోసం గాలిస్తున్న సమయంలోనే యువకుడు వాగులో చెట్ల కొమ్మను పట్టుకుని బయటకు రావడం జరిగింది. ద్విచక్ర వాహనం వరద నీటిలో కొట్టుకుపోయింది. బయటకు వచ్చిన యువకుడిని వారి కుటుంబీకులతో మాట్లాడించి తనకు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని తెలిపారు. ఏది ఏమైనా యువకుడు ప్రాణలతో బయటపడడంతో అక్కడున్న వారు ప్రాణగండం తప్పిందంటూ పేర్కొన్నారు.

● వరదల్లో వాగులు దాటకండి: సీఐ

జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల సమీపంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని ప్రజలెవరు వాగులు దాటి సాహసం చేయవద్దని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని పేర్కొన్నారు. ప్రాణాల కంటే ఏ పని గొప్పది కాదని పేర్కొన్నారు. వరద ఉధృతి కొనసాగుతుందని తెలుసుకున్న స్థానిక ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నా యకులు పి.చంటి వాగు వద్దకు చేరుకుని ప్రవాహంలో కొట్టుకుపోయి బయటపడ్డ వ్యక్తితో మాట్లాడడం జరిగింది. అక్కడే ఉన్న పోలీస్ అధికారులతో మాట్లాడారు.



వాగు ఉధృతి సమాచారం తెలియడంతో దన్ను వాగు వద్దకు వచ్చిన సీఐ, ఎస్సైలు

ప్రజలు బయటకు రావొద్దు

- బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండండి: బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న అత్యంత భారీ వర్షాల కారణంగా నేరడిగొండ మండలంలోని వాంకిడి వాగులనూ చెక్ డ్యాంలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న అత్యంత భారీ వర్షాల కారణంగా బోథ్ నియోజకవర్గ ప్రజలెవరు కూడా బయటకు రావొద్దని, వాగు వంకలకై ఎవరు వెళ్లొద్దని అత్యవసరమైతే తప్ప బయట వెళ్లొద్దన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు ఈ సమయంలో ప్రజలు అందుబాటులో ఉండాలని వారికి ఎలాంటి సహాయం కావాలన్న అందించే విధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. భారీ వర్షంలో నేరడిగొండ మండలంలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం కురుస్తున్న భారీ వర్షాలకు నేరడిగొండ మండల కేంద్రంలోని పలు కాలనీలు నీట మునిగిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాలనీల్లో పర్యటించారు. నీటిలో మునిగిన పలు ఇళ్లను పరిశీలించారు. బ్రిడ్జిలు, డ్రైనేజీలను పరిశీలించారు. వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెంట రమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, గులాబ్, సాబ్లే సంతోష్, శాదబ్, శ్రీధర్ రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.



మోకలి లోతు నీటిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఉట్నూర్ డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం నేరడిగొండ పిహెచ్‌సిని సందర్శించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెంది, డెంగ్యూ, మలేరియా, అతిసారం, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ మోహన్, బాపూజీ, ఎంఎల్‌హెచ్‌పి వాణి, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్. హెల్త్ అసిస్టెంట్ సాయన్న. నర్సయ్య. ఫార్మాసిస్ట్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

బాసరలో వర్ష బీభత్సం

- పొంగిన బిదరెల్లి వాగు
- బాసరతో వివిధ గ్రామాలకు తెగిన బంధం
- జాతీయ రహదారిని ముంచెత్తిన వరద నీరు
- లోతట్టు నివాసాలు జలమయం

బాసర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం బీబత్సం సృష్టించింది. జనజీవనం స్థంబించి పోయింది. మండలంలో అన్ని గ్రామాలను కలుపుతూ ప్రవహించే బిదరెల్లి వాగు పొంగడంతో గ్రామాలతో సంబంధం తెగిపోయింది. బాసర, ఓని, బాసర, కిర్గుల్(బి), గ్రామాల మధ్య వాగు పై ఉన్న వంతెన వరద నీటితో నీట మునిగాయి. రాకపోకలు, పూర్తిగా నిలిచిపోయాయి. వాగు వెంబడి పత్తి, సోయా, వరి వంటి పంట పొలాలన్ని నీట మునిగాయి. బాసర మండలం బిదరెల్లి గ్రామం వద్ద వరద నీరు జాతీయ రహదారిపై 161 ముంచెత్తడంతో మూడు గంటల పాటు బాసర భైంసా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో లోతట్టు నివాసాలు జలమయమయ్యాయి. బాసర మండలం తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై శ్రీనివాస్, మండలంలోని పర్యటించి వరదను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేశారు. నిండిన చెవరులను కట్టలు తెగిపోకుండా నీటిని తూముల గుండాకు వదిలారు. గురువారం సాయంత్రం వరుణదేవుడు కరుణించడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విరామం లేకుండా వాన కష్టాలు అధికమయ్యేవి.



బాసర మండల కేంద్రంతో గ్రామాలకు వెళ్లే రోడ్డు ముంచెత్తిన వరద



బిద్రెల్లి వద్ద జాతీయ రహదారి161 పై నుంచి ప్రవహిస్తున్న వరద



బాసర వద్ద నీట మునిగిన గోదావరి స్నాన ఘట్టాలు

గల గల పారుతున్న గోదావరి

బాసర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మన ప్రాంతంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి తోడు ఎగువన మహారాష్ట్ర నుండి పెద్ద ఎత్తున వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. భక్తులు స్నానం ఆచరించే ఘట్టాలన్ని నీటమునిగిపోయాయి. నది నీటితో నిండుగా రెండు ఒడ్డు అంచులను తాకుతూ ప్రవహిస్తుంది. లక్షల క్యూసెక్కుల నీరు దిగువ శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయి. నది తీరం భయానకంగా మారింది. బాసరకు వచ్చిన భక్తులను నదిలో దిగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేవారు. నది ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.



బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

స్తంభించిన జన జీవనం

- మురికి కాలువలు లేక ఇబ్బందులు

ఉట్నూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్థంభించింది. బుధవారం నుంచి ఒక వైపు వినాయక ఉత్సవాలు ప్రారంభంకాగా మరో వైపు భారీ వర్షాలు కురుస్తుండడంతో భక్తులకు సంకటంగా మారింది. ఉట్నూర్ మండలంలో 42.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా ఇంద్రవెల్లి మండలంలో 32.2 మి.మీ, నార్నూర్‌లో 51.4, గాదిగూడ మండలంలో 25.8 మి.మీల వర్షపాతం నమోదు అయింది. మండలంలోని మత్తడిగూడ ప్రాజెక్టు నిండి పోవడంతో వరద నీరు మత్తడిదూకి ప్రవేశిస్తుంది. సంబుగుల మత్తడిగూడ మధ్య ఉన్న లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాంపూర్, మత్తడిగూడ గ్రామస్థులు బయటకు రాలేక పోయారు. అదే విధంగా వంక తుమ్మ వాగు, నర్సాపూర్ జె, వాగులు పొంగి ప్రవహించాయి. వాగు పరివాహక ప్రాంతాలలో ఉన్న పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఉట్నూర్ పట్టణంలో సరైన వరద నీటి కాలువలు లేక పోవడంతో అంబేద్కర్‌చౌక్ నుంచి బస్టాండ్ వెళ్లే ప్రధాన రహదారి పై వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల కారణంగా విద్యా సంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించినప్పటికి సకాలంలో ఉపాధ్యాయులకు సమాచారం రాక పోవడంతో కొన్ని ప్రాంతాల ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి తిరిగి ఇంట్లకు చేరుకున్నారు. ఏది ఏమైనా ఏకదాటిగా కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడం లేదు.



ఉట్నూర్ మండలంలో పంటల్లో చేరిన వర్షపు నీరు

హస్నాపూర్‌లో మురికి కాలువలు సరిగ్గా లేక ఇబ్బందులు

మండలంలోని హస్నాపూర్‌లో సరైన రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ లేక పోవడంతో ప్రజలు కురుస్తున్న వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సమయంలో మురికి కాలువలు లేక పోవడం వల్ల నీరు నిలిచి పోయి ఇళ్లలోకి చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు జాదవ్‌అజయ్ ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.



కొల్హారి గ్రామంలో వరద నీటి ప్రవాహం

బజార్‌హత్నూర్: మండలంలో గురువారం ఉద యం నుంచి ఏకదాటిగా కురిసిన వర్షానికి వాగులు ఉప్పొంగి పారాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బజార్ హత్నూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కాలనీలు జలమయమయ్యాయి. జవహర్ నగర్, ముత్యంపేట కాలనీవాసులకు ఇరువైపులా రెండు వాగుల వరదలతో నాలుగు గంటల పాటు జలదిగ్బంధంలో ఉండిపోయారు. మోర్ఖండి, కొత్తపల్లి, గిరిజాయి వాగులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు వర్షం ధాటికి సంతకు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే నదీ పరివాహ ప్రాంతాల్లో పంట చేలలో వరద నీరు చేరాయి.

ఆస్పత్రిలో తడిసిన ఔషధాలు

ముథోల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్ లోని ప్రభుత్వ ఆస్పత్రిలో వర్షంతో గురువారం మందులు తడిసిపోయాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ముందే శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనం పెకప్పు ఉరవటంతో ఆస్పత్రిలో ఉన్న మందులు తడిసిపోయాయి. ఆస్పత్రి భవనం వర్షపు నీటితో లోపల తడిసిపోయింది. రోగుల కోసం ఇచ్చే మందులు కూడా వర్షంతో తడిసిపోయాయి. వర్షంతో ఆసుపత్రి ఉరవడంతో విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకొని తహసీల్దార్ శ్రీలత ఆసుపత్రిని సందర్శించారు. తడిసిన మందులను పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా సేవలందించాలని సూచించారు. మందులు తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, ఆర్ఐ నారాయణ రావు పటేల్, తదితరులున్నారు.



ఆస్పత్రిలో తడిసిన మందులు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.6 । కనిష్ఠం 23.7

నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 29 ఆగస్టు 2025


భైంసాలో జేసీబీ ద్వారా వరద తొలగింపు


సారంగాపూర్ మండలం అర్సన్ గండి రామన్న పార్క్ వద్ద విరిగి పడ్డ చెట్టు


ఖానాపూర్ మధురనగర్ కాలనీలో..


కోతకు గురైన మాడెగాం ఘాట్ రోడ్డు


దస్తురాబాద్‌లో ఇంటి ఆవరణలో నిలిచిన నీరు


గడ్డెన్నవాగు ప్రాజెక్టు నుంచి సుద్దవాగులోకి వదిలిన వరద నీరు

ముంచెత్తిన వాన

- పొంగిపొర్లిన వాగులు, ధ్వంసమైన రోడ్లు స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన పంటలతో భారీ నష్టం
- మూడుప్రాజెక్టుల్లోకి పెరుగుతున్న వరద
- అక్కాపూర్‌లో 33.3 సెంటీమీటర్ల వర్షపాతం

నిర్మల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో బుధవా రం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఎడతె రిపి లేకుండా కుండపోతగా వానకురిసింది. ఈ వర్షానికి జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించిం ది. జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 13.3 సెంటీ మీటర్ల సగటు వర్షపాతం నమో దు అయింది. నిర్మల్‌లో అత్యధికంగా 33.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షం దాటికి ప్రాజెక్టు లోకి వరద నీరు పెరుగుతోంది.


ఖానాపూర్ సదర్మాట్ వద్ద నీటి ప్రవాహం

ప్రాజెక్టులకు పెరిగిన వరద ఉధృతి...

కడెం ప్రాజెక్టులోకి గురువారం ఉదయం 16,894 క్యా సెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి 27,663 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిలో సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తు తం ప్రాజెక్టులో 3.477 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టులోకి గురువారం ఉద యం 1500ల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుం డగా ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 1900 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిలో సామర్థ్యం 1.37 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.895 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబు తున్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు లోకి గురువారం ఉదయం 2242 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు ఒక్క గేటును ఎత్తి 2784 క్యూసెక్కుల నీ టిని ది గువ కు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిలో సామర్థ్యం 1.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.658 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

తెగిన రోడ్లు...

భారీ వర్షం దాటికి సారంగాపూర్ మండలం బోరిగాం వద్ద స్వర్ణ ప్రాజెక్టు ఎడమ కాలువకు గండి పడింది. సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి, వంజర్ గ్రామాల మధ్యలో గల వంతెన వద్ద రోడ్డు తెగిపోయింది. నర్సాపూర్ మండలంలో దేవుని చెరువు కట్టకు గండి పడ డంతో పంట చేలన్ని నీట మునిగాయి. దిలావర్‌పూర్ మండలంలో వర్షం ధాటికి గేదె మృతి చెందింది. కుంటాల మండలంలో భారీగా పంట చేలల్లోకి వరద నీరు చేరడంతో పంటలన్నీ నీట మునిగాయి. ఖానాపూర్‌లో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షంతో రెంకోని వాగు ఉప్పొంగి ప్రవహించి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూ ల్‌కు రాకపోకలు నిలిచిపో యాయి. విద్యార్థులను అతి కష్టం మీద మరో మార్గం గుండా దాటించేందుకు అధికా రులు శ్రమించారు. మండలం లోని తర్లపాడ్, పాత తర్లపాడ్ మధ్య వాగు ఉప్పొంగడంతో రెండు గ్రామాల మధ్య రాకపో కలు నిలిచిపోయాయి. మస్కా పూర్‌లోని మధుర నగర్ కాల నీలో వరద నీరు చేరింది.

పలు రైళ్లు రద్దు... మరికొన్ని మళ్లింపు

బాసర : భారీ వర్షాలు వరదల కారణంగా బాసర మీదుగా నడిచే పలు రైళ్లు రద్దుకాగా మరికొన్ని దారి మళ్లించారు. బుధవారం నిజామాబాద్-కామా రెడ్డి స్టేషన్ల మధ్య వరద దాటికి పట్టాల మట్టి కట్టలు తెగిపోవడంతో సికింద్రా బాద్ - నాందెడ్ మధ్య రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా బుధవారం కొన్ని రైళ్లు రద్దుకాగా మరికొన్ని పెద్దపల్లి, కరీంనగర్, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు రైలు నడిచేలా అధికారులు మళ్లించారు.

ఎన్డీఆర్ఎఫ్ బృందాలు...

లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి వద్ద గోదావరి కుర్రులో చిక్కుకున్న ము గ్గురు పశువుల కాపర్లను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. భారీ వర్షం కార ణంగా వివిధ రకాల పం టలు తీవ్రంగా నష్టపోయాయి.


కడెంలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయు లతో మాట్లాడిన కలెక్టర్ అత్యవసరమైతే తప్ప ఎవరు ఇళ్ల నుంచి బయ టకు రావద్దని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్నవారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌నెంబర్ 9100577132ను సంప్రదించా లని కలెక్టర్ సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. లక్ష్మణ చాంద మండలంలోని మునిపెల్లి గ్రామంలో వాగు అవతలి వైపు చిక్కు పోయిన శంకర్ అనే పశువుల కాపరిని ఎన్డీఆర్ఎఫ్ బృం దాల సహకా రంతో సురక్షితంగా రక్షించగలిగామని కలెక్టర్ వివరించారు. సమావే శంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

జీఎన్ఆర్ కాలనీలో వరద


జీఎన్ఆర్ కాలనీ ముంపు నీటిలో ఈదుతున్న నీటి పిల్లులు

నిర్మల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు తోడు స్వర్ణ వాగు ఉప్పొంగి ప్రవహి స్తుండడంతో పట్టణ శివా రులోని జీఎన్ఆర్ కాలనీలోకి భారీగా వరద వచ్చి చేరుతోం ది. కాలనీ ప్రజలు ఇబ్బం దులు పడుతుండగా మరోవైపు నీటి పిల్లులు (వాటర్ డాగ్స్) కనిపిస్తుండ డంతో వారంతా భయాందోళన చెందుతున్నారు. దాదాపు 20 నుంచి 30 వరకు ఈ నీటి పిల్లులు వరదలో ఈదుకుంటూ జనాల చెంతకు చేరుతుం డడంతో ఎప్పుడూ చూడని ఈ కొత్త రకం జీవిని చూసి కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇవి ఎక్కువగా చేపలను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తాయని, పెద్ద పెద్ద జలాశయాల్లో మాత్రమే కనిపిస్తా యని చెబుతున్నారు.

జ్యోతి బాపూలే రెసిడెన్షియల్‌లోకి వర్షపు నీరు

ముథోల్ : మండలంలో బుధవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా మండల కేంద్రమైన ముథోల్‌లోని సాయి మాధవ్ నగర్‌లో గల జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలోకి వర్షం నీరు చేరింది. ఈ వర్షం నీటిలో పాఠశాల వాతావరణం విద్యార్థులకు అనుకూలంగా లేకపోవడంతో ప్రిన్సిపాల్ తక్షణ నిర్ణయం తీసుకుని విద్యా ర్థులను వారి ఇళ్లకు పంపించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా రెండు రోజులు సెలవులు ప్రకటించి విద్యార్థులను వారి తల్లిదండ్రులకు సమా చారం ఇచ్చి వారి వెంబడి పంపించినట్లు ప్రిన్సిపాల్ అమృత తెలిపారు.

నిలిచిన రాకపోకలు

సోన్ : చెరువులు, నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పంటల భూములన్ని జలదిగ్బంధం అయ్యాయి. దీంతో రైతులు పంట భూముల్లో వర్షపు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. స్వర్ణ ప్రాజెక్టు గేట్ల నుంచి నీరు వదలడంతో సోన్ మండలంలోని జాఫ్రాపూర్, మాదాపూర్ గ్రామాల వద్ద గల వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహిం చడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

కడెం : మండల కేంద్రంలోని 6వ వార్డులో భారీ వర్షం కారణంగా ఇళ్ల ల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా తమకు శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు అధికాలను, ప్రభుత్వాన్ని కోరారు.

దస్తురాబాద్ : మున్యాల్, బుట్టాపూర్ గ్రామంలో కొన్ని కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరింది మండ లంలోని నీట మునిగిన ముంపు ప్రాంతాలను తహసీల్దార్ బత్తుల విశ్వం బర్, ఎస్సై సాయి కుమార్ పరిశీలించారు.

కుంటాల : కల్లూరు- కుంటాల రహదారిపై అందకూర్ చెరువు అలుగు నీటి ప్రవాహానికి కల్లూరు - కుంటాల రహదారిపై ఉన్న బ్రిడ్జి కోతకు గురైంది. కుంటాల గ్రామ సమీపంలో దౌనెల్లి రహదారి కోతకు గురికాగా కుంటాల - అంబకంటి రహదారి కోతకు గురైంది. సూర్యాపూర్ రాజరాజే శ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు వర్షం దాటికి కొట్టుకపోయింది.

మామడ : కిషన్ రావుపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతిన గర్ తండాలోని రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపో యాయి. గ్రామానికి వెళ్లాలంటే నీలాయిపేట్ నుంచి తిరిగి రావాల్సి వస్తుం దని ప్రజలు వాపోతున్నారు. పొన్కల్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం.


శాంతినగర్ కిషన్‌రావుపేట్ గ్రామాల మధ్య తెగిన రోడ్డు


పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ


డ్రోన్‌తో బాధితుడికి పంపుతున్న ఆహారం


గోదావరి మధ్యలో ఉన్న శంకర్ నాయక్


బోట్ ద్వారా నాయక్‌ను తీసుకువస్తున్న సిబ్బంది

రాత్రంతా గోదావరి మధ్యలో..

- కలెక్టర్, ఎస్పీ చొరవతో క్షేమంగా నాయక్

లక్ష్మణచాంద, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామ పుష్కరఘాట్ వద్ద ఎస్పీ జానకి షర్మిల, కలెక్టర్ అభిలాష అభి నవ్ చొరవతో గురువారం మధ్యాహ్నం 2 గంట లకు ఉత్కంఠకు తెరపడింది. స్థానికులు, అధికా రుల సమాచారం ప్రకారం బుధవారం ఉదయం మునిపెల్లి గ్రామానికి చెందిన పల్లికొండ శ్రీని వాస్, బొడ్డు లింగన్నలు, పార్‌పెల్లి తండాకు చెం దిన గుగ్లావత్ శంకర్ నాయక్ అనే ముగ్గురు గేదెలను మేపటం కోసం గోదావరి మధ్యలో గల కుర్రుకు (నది మధ్యలో గల విశాలమైన గడ్డి భూమి గల ప్రాంతం) వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఎస్సారెస్పీ నుంచి 2,50,000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వది లారు. దీంతో గోదావరి ప్రవాహం మట్టం పెరిగి ఈ ముగ్గురు నది మధ్యలో ఉండిపోయారు. ఈ విషయం తెలిసిన నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల స్థానిక ఎస్సై శ్రీనివాస్‌ను అప్రమత్తం చేసి సం ఘటనా స్థలానికి వచ్చారు. వరద ఉధృతి గమ నించిన పల్లికొండ శ్రీనివాస్, బొడ్డు లింగన్నలు తెప్ప సహాయంతో గట్టుకు వచ్చారు. కానీ గుగ్లా వత్ శంకర్ నాయక్ మాత్రం గోదావరి మధ్య లోనే ఉండిపోయారు. ఇతన్ని కాపాడటం కోసం రెస్క్యూ టీం వచ్చినప్పటికీ భారీ వర్షం కారణం మగా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. దీం తో బుధవారం రాత్రంతా నిద్రాహారాలు లేక శం కర్ నాయక్ గోదావరి మధ్యలోనే బిక్కుబిక్కు మంటూ గడిపారు. శంకర్ నాయక్ వద్ద మొ బైల్ కూడా లేకపోవడంతో ఎలాంటి సమాచారం అందే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఉదయం నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, కలెక్టర్ అభిలాష అభినవ్ మునిపెల్లిలోని గోదావరి నది గట్టువద్దకు వచ్చి పరిస్థితిని స్వయంగా సమీక్షిం చారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం బోట్ ద్వారా పార్ పెల్లి తండా రేవు నుంచి వెళ్లి బాధితుడిని ఒడ్డు కు చేర్చి ప్రాణాలు కాపాడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అనంతరం బాధితుడిని నిర్మల్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు అం దించి క్షేమంగా ఇంటికి చేర్చారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహే శ్వర్ రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు ఈ పరిస్థితిపై ఆరా తీశా రు. అను చరుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ సం ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి యోగక్షే మాలు తెలుసుకున్నారు. పరిస్థితిని సమీక్షిం చారు. అధికారులతో మాట్లాడారు.

పర్యటించిన అధికారులు, నాయకులు


తెగిన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


వరద ప్రభావాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ

సోన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని వరద ప్రభావిత ప్రాంతాలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలిం చారు. మండలంలోని కూచన్‌పెల్లి రోడ్డుతో పాటు, మాదాపూర్ బ్రిడ్జిని పరిశీలించి వరద నీటి ఉధృతికి గ్రామం లో ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు.

సారంగాపూర్ : మండలంలో వరద ప్రభా విత ప్రాంతాలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పర్యటించారు.

నిర్మల్‌రూరల్: పట్టణంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాల కారణంగా పట్ట ణంలో ముంపునకు గురైన పలు ప్రాంతాల్లో పర్యటించి, బాధిత కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. పట్టణంలోని బంగల్‌పేట్ చెరువు లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించినట్లు జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల తెలిపారు. భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ జలమయం అవడంతో ఆది లాబాద్ నుంచి వయా కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు మండలం లోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపుకి తిరిగి డైవర్షన్ మార్చుకొని కొండాపూర్ నుంచి వయా మామడ, ఖానాపూర్, మెట్‌పల్లి, జగి త్యాల్, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లగల రని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.

నర్సాపూర్(జి) : పి. శకుంతల, ఆర్. పుష్ప లకు చెందిన ఆయిల్ పామ్ తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నీటి ఉధృతికి నందన్ ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న అంతర్గత రహదారి కూడా తెగి పోవడంతో నందన్, బామ్ని గ్రామాలకు రాకపో కలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నష్టాన్ని అం చనా వేయడానికి మండల తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై గణేష్, ఎస్. గంగాధర్ (ఏఈ), నరేష్ కుమార్ (డీఈఈ), అనిల్ జాదవ్ (ఈఈ) వంటి ఇరిగేషన్ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

భైంసా : భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ఆదేశాలకు అనుగుణంగా డివిజన్ పరి ధిలో ఏడు మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖాధికారులు భారీ వర్షాల మూలం గా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగకుండా ఉండేందుకు గాను చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాలతో పాటు ముంపు బెడద పొంచిఉన్న ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, పం చాయతీరాజ్‌శాఖాధికారులు పర్యటిస్తూ ప్రజ లను జాగరుకత పరిచారు. భైంసా ఏఎస్పీ అవి నాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్ నేతృత్వంలో టౌన్ ఎస్ఐ సుప్రియ రక్షణ చర్యలు చేపట్టింది. మున్సిపల్ సిబ్బంది ద్వారా జేసీబీ యంత్రంతో మురికి కాలువల్లోని పూడిక తొలగింపులు , వర్షపునీటి ప్రవాహపు దారి మళ్లింపు చర్యలు వేగవంతంగా నిర్వహింపచేసి ముంపు బెడద ఏర్పడకుండా సత్వర చర్యలు చేపట్టారు.మున్సి పల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అనీస్ పట్టణ పరిధిలో పారిశుద్య సిబ్బందితో విస్తృత పర్యట నలు చేపట్టి వర్షపు నీరు నిల్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని చిన్నపాటి కాలువలను తవ్వించి దారి మళ్లింపు చేపట్టారు.


ముధోల్‌లో లోలెవెల్ వంతెనను పరిశీలిస్తున్న ఎంపీడీవో శివకుమార్

జలమయం..

నిర్మల్ రూరల్ : మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ప్రజానీకాన్ని అతలాకుతలం చేసింది. అత్యధికంగా అక్కాపూర్ గ్రామంలో 332.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. న్యూ పోచంపాడ్ రైతు వేదికలో నాలుగు కుటుంబాలను, ముజ్గిలో ఐదు కుటుంవాలను పున రావాస కేంద్రంలో తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గజా నంద్, డీపీవో శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ సంతోష్, కార్యదర్శులున్నారు. భారీ వర్షాలతో మండలంలోని కొండాపూర్‌లో కుంటకు గండి పడిన విష యం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అక్కడికి వెళ్లి గుంటను పరిశీలించారు. నిర్మల్, హైదరాబాద్ మధ్య రాకపోకలు నిలిపి వేయడంతో హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు కొండాపూర్ వద్ద రహదారి ఇరువైపులా కిలో మీటర్ మేర భారీ వాహనాలు నిలిచిపోయాయి.

దిలావర్‌పూర్ : కదిలి, మాడెగాం ఘాట్ రోడ్డు వరద నీటి తాకిడికి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. స్వర్ణ వాగు పరివాహక భూముల్లో సాగు చేసిన పత్తి పంటలో నీరు చేరడంతో 30 ఎకరాల వరకు పత్తి దెబ్బ తింది. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎస్సై రవీందర్ నేతృత్వంలోని టీంలు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించాయి.

సారంగాపూర్ : నిర్మల్, ఆదిలాబాద్ రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. వంజర్, బీరవెల్లి రహదారిపై ఉన్నటువంటి వంతెన తెగి పోవడంతో గ్రా మాలకు రాకపోకలు నిలిచి పోయాయి. రెండు రోజుల నుంచి కురిసిన వ ర్షాలకు నష్టం వాటిల్లిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నీట మునిగిన పంట పొలాలను, తెగిపోయిన వంతెనలను పరిశీలించి వర్షాలకు తెగిపోయిన వంతెనలను తక్షణమే మరమ్మతులు చే పట్టి ఇతర గ్రామాలకు నిలిచి పోయిన రాకపోలకు సాగే విధంగా సంబంధి త అధికారులు చర్యలు చేపట్టాలని ఫోన్‌లో మాట్లాడారు.

ముథోల్ : సాయిమాధవ్ నగర్, బస్టాండ్ ఏరియాలో వర్షం నీరు భారీగా చేరింది. బోరిగాం, వడ్తాల్ గ్రామాల మధ్యలో వంతెన పొంగి ప్రవ హిస్తుంది. దీంతో వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపో కలు నిలిచిపోయాయి. ముథోల్ తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివ కుమార్, ఆర్ఐ నారాయణ, కార్యదర్శులు వెళ్లి వరద ఉధృతిని పరిశీలించారు.

భైంసా : కుండపోత వర్షంతో పలు ప్రాంతాలు జలమయమవ్వగా పంట చేలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, పంటచేలలో వర్షపు నీరు అధిక మొత్తంలో నిలిచి చెరువులను తలపించాయి. ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతాల్లోని పంటచేలలోకి వర్షపు నీరు ఉధృ తితో ప్రవహించడం మూలంగా ప్రభావిత ప్రాంతాల్లోని పంటల పైర్లు దెబ్బ తినడంతో పాటు పంటభూములు కోతకు కూడా గురయ్యాయి.

ఖానాపూర్ : రావి చెరువు ప్రాంతం నుంచి వచ్చే వాగు ఉప్పొంగడంతో తర్లపాడ్ - పాత తర్లపాడ్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని బుడగజంగం వాడలో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది.


సారంగపూర్‌లో వంతెనను పరిశీలిస్తున్న మాజీ మంత్రి